క్లుప్తంగా

సీహెచ్ గున్నేపల్లి ఉప సర్పంచ్‌గా హేమకుమారి

ముమ్మిడివరం: మండలంలో సీహెచ్ గున్నేపల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా పాము హేమ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా ఉన్న యాళ్ల ఉదయ్ జెంటిల్మన్ ఒప్పందం మేరకు గడువు ముగియడంతో రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాట్రేనికోన మండల ఈఓ పీఆర్‌డీ బి.మమత ఎన్నికల అధికారిగా ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. వార్డు సభ్యులందరూ 8వ వార్డు సభ్యురాలైన పాము హేమ సుందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఇందుమతి కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, నల్లా బాబాయ్, సఖిలే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా కాశి ధనలక్ష్మి

ఐ.పోలవరం: జి.మూలపొలం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కాశి ధనలక్ష్మి ఎంపిక అయ్యారు. ముందుగా చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకూ దండుప్రోలు కోయిరాజు ఉప సర్పంచ్‌గా కొనసాగారు. గురువారం జరిగిన పంచాయతీ సమావేశంలో ఈమెను ఎన్నుకొన్నారు. ధనలక్ష్మికి ఎంపీటీసీ రేవు అప్పారావు అభినందనలు తెలిపారు.

కవులకు డీఐఈవో సత్కారం

అమలాపురం టౌన్: తెలుగు భాషాభివృద్ధికి నాలుగు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న తెలుగు అధ్యాపకులు, కవులు నల్లా నరసింహమూర్తి, బి.బాబూరావులను డీఐఈవో వనుము సోమశేఖరరావు గురువారం సత్కరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వారిని సత్కరించారు.

నవోదయకు 73 మంది ఎంపిక

యానాం: 2025–26 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయ, యానాంలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని గురువారం ప్రిన్సిపాల్ సి.రాజశేఖర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి 73 మంది ఎంపికకాగా, 9వతరగతిలో ప్రవేశానికి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

త్వరలో పోస్టుల భర్తీ

యానాం: యానాం, మాహే,పుదుచ్చేరి, కారైకల్ రీజియన్‌లలో ఖాళీగా ఉన్న 516 పోలీస్, 475 అధ్యాపక పోస్టులకు త్వరలో భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ,హోమ్ శాఖల మంత్రి నమశ్శివాయం తెలిపారు. గురువారం చివరిరోజు బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ ఇన్స్పెక్టర్స్–70, గార్డ్స్–156, డ్రైవర్స్–7, కుక్స్–17, అసిస్టెంట్స్–25, టెక్నికల్ హేండలర్స్–29, రేడియో టెక్నీషియన్స్–12, కోస్టుగార్డ్స్–200 పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. నీట్ పరీక్షకు 4 ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ఏర్పాటుచేశామని, బాల,బాలికలకు స్నాక్స్ కోసం చిరుధాన్యాలను ఇస్తున్నట్లు తెలిపారు. 9నుంచి 12 వ తరగతి వరకు ట్రేక్ సిస్టమ్ ఐడెంటిటీ కార్డులు విద్యార్థులకు ఇస్తున్నట్లు తెలిపారు.

జిప్‌మెర్ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే అశోక్ సమావేశం

యానాం: పుదుచ్చేరి జిప్‌మెర్ ఆసుపత్రి డైరెక్టర్ వీర్‌సింగ్ నెగి తో గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం యానాంలో ఉన్న జిప్‌మెర్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలను ఏప్రిల్, మే నెలల నుంచి అందించనున్నట్లు తెలిపారన్నారు. అదేవిధంగా కిడ్నీసంబంధిత వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతం వెళ్లకుండా జిప్‌మెర్‌లో డయాలిసిస్ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు దానికి సంబంధించిన పనులు పూర్తవుతున్నట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెంలో పునర్‌నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయానికి కనకాలపేట గ్రామానికి చెందిన బెజవాడ రాంబాబు, సుబ్బలక్ష్మి దంపతులు రూ. 3,10,116 విరాళం అందజేశారు. గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్‌ను అందజేశారు.

స్టేట్‌హుడ్ కోరుతూ 16వ సారి తీర్మానం

యానాం: కేంద్రపాలితప్రాంతంగా ఉన్న పుదుచ్చేరికి రాష్ట్రహోదా స్టేట్‌హుడ్ ఇవ్వాలని కోరుతూ గురువారం పుదుచ్చేరి అసెంబ్లీలో 16వ సారి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇప్పటివరకు 15 సార్లు స్టేట్‌హుడ్ కోసం తీర్మానాలను ఆమోదించి కేంద్రానికి పంపారు. రాష్ట్రహోదా అంశాన్ని డీఎంకె, కాంగ్రెస్, స్వతంత్ర శాసనసభ్యుడు తీర్మానాన్ని సభలోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్‌కాంగ్రెస్, బిజెపి తదితర సభ్యులు తీర్మానానికి మద్దతునివ్వడంతో ఏకగ్రీవంగా ఆమోదించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవులోని 33–11 కేవీ, చొల్లంగి సబ్‌స్టేషన్ 11కేవీ, చొల్లంగి ఫీడర్ 11 కేవీ, చొల్లంగి ఇండస్ట్రియల్ ఫీడర్, జి.వేమవరం ఫీడర్‌లలో విభజన పనుల దృష్ట్యా చొల్లంగి, జి.వేమవరం, చొల్లంగిపేట పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఇంటింటికీ గ్యాస్ మాకేది?

- కాలుష్యం మాకు... గ్యాస్ ఇతరులకా?
- పోలేకుర్రు టు యానాం గ్యాస్ పైపులైన్ నిర్మాణం
- సుంకటరేవులో శరవేగంగా గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ నిర్మాణం
- జనావాసాల మధ్య నిర్మాణంపై భయాందోళనలో ప్రజలు
- అసంపూర్తి పనులతో వ్యాపారులకు ఇబ్బందులు



గ్యాస్ ట్యాపింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు వద్ద శరవేగంగా జరుగుతున్న గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ నిర్మాణ పనులు



సుంకరపాలెం జంక్షన్‌లో పైపులైన్ నిర్మాణ సంస్థ తవ్వేసి అసంపూర్తిగా వదిలేసిన రహదారి

తాళ్లరేవు: దేశంలోనే పేరెన్నికగన్న రెండు అతిపెద్ద చమురు సంస్థలు తాళ్లరేవు మండలంలో ఉన్నప్పటికీ మండల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడంలేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చమురు సంస్థలు ఉన్న ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని గాడిమొగలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉండగా, పి.మల్లవరం పంచాయతీలో ఓఎన్‌జీసీ సంస్థ ఉంది. దీంతో తాళ్లరేవు మండల రూపురేఖలు మారిపోతాయని అందరూ భావించారు. అయితే ఆయా చమురు సంస్థలు సవతి తల్లి ప్రేమను చూపిస్తూ ఉన్న మండలానికి నిధులు కేటాయించకుండా ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేస్తుండడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు చమురు సంస్థలు ఉన్నప్పటికీ ఇంటింటికీ గ్యాస్‌ను సరఫరా చేయించడంలో స్థానిక నాయకులు విఫలమయ్యారు. మండల సరిహద్దులో ఉన్న యానాంకు మాత్రం ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మించారు. అది కూడా తాళ్లరేవు మండలంలోని పలు గ్రామాల మధ్యలోనుంచి పైపులైన్ వేసి జనావాసాల మధ్యలో సుంకటరేవులో గ్యాస్ ట్యాపింగ్ యూనిట్‌ను పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(పీఐఎల్) సంస్థ నిర్మిస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు ఐదు నెలలపాటు పనులు నిలిచిపోయాయి. అయితే ఇటీవల గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ పనులను యథావిధిగా నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికులు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అభివృద్ధికి పైపులైన్ నిర్మాణ సంస్థ నిధులు కేటాయించేందుకు అంగీకరించిన కారణంగానే తిరిగి పనులు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

ముందు స్థానికులకే ఇవ్వాలి

చమురు సంస్థల ద్వారా స్థానిక గ్రామాలకు ఇంటింటికీ గ్యాస్ ఇచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు ఇవ్వాలని సర్వత్రా కోరుతున్నారు. సంస్థల కారణంగా నష్టపోతున్న తమకు గ్యాస్ ఇవ్వకుండా వేరే ప్రాంతానికి ఎలా తరలిస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. చమురు సంస్థల కారణంగా ప్రధానంగా గాడిమొగ, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, సీలపల్లి, తాళ్లరేవు తదితర ప్రాంతాల్లో కాలుష్యం అధికంగా ఉంటుంది. అయినప్పటికీ ఈ ప్రాంతాల అభివృద్ధికి తూతూ మంత్రంగా నిధులు కేటాయిస్తూ ఇతర ప్రాంతాలకు మాత్రం నిధులు వెచ్చించడంపై ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు సంస్థల కారణంగా ఆయా గ్రామ పంచాయతీల ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతోందని, కంపెనీలకు తాగునీరు సరఫరా అవుతుందని, కంపెనీ కాలుష్యం అధిక మొత్తం తమ గ్రామాలపైనే ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల మధ్య నిర్మిస్తున్న ఈ గ్యాస్ పైపులైన్, ట్యాపింగ్ యూనిట్‌ల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ ఆస్తి, ప్రాణ నష్టం చవిచూడాల్సి వస్తుందని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఆర్థికంగా సహకరించాలి



మండలంలో ఉన్న చమురు సంస్థల కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తొలుత స్థానిక గ్రామాల ప్రజలకు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయడంతో పాటు ఆయా గ్రామాల్లోని రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించడంలో ఆర్థికంగా సహకరించాలి. ఆయా కంపెనీల నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీలను, ఒప్పందాలను కచ్చితంగా అమలు చేయాలి.

– దడాల బుజ్జిబాబు, మాజీ సర్పంచ్, పోలేకుర్రు గ్రామ పంచాయతీ

అసంపూర్తి పనులతో అవస్థలు



యానాంకు గ్యాస్ పైపులైన్ నిర్మాణం కారణంగా పలుచోట్ల రహదారులను తవ్వేసి వాటిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించకపోవడంతో స్థానికులు, వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలలుగా వ్యాపారాలు సరిగా లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా జాతీయ రహదారి చెంతన సుంకరపాలెం జంక్షన్‌లో లోతుగా తవ్వేసి సక్రమంగా పూడ్చక పోవడంతో అనేకమంది ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు. తక్షణమే రహదారులను పునరుద్ధరించాలి. పైపులైన్ నిర్మాణ సంస్థ వ్యాపారులను ఆదుకోవాలి.

– పుగాకు వాసు, శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం అధ్యక్షుడు, సుంకరపాలెం జంక్షన్, తాళ్లరేవు మండలం

రాజకీయాలకు అతీతంగా ప్రగతి

- స్పష్టం చేసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మున్సిపల్ కౌన్సిల్



పట్టణాభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే ఆనందరావు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి పాటుపడదామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశం మాస్టర్ ప్లాన్, డంపింగ్ యార్డ్, తాగునీటి పైపులైన్లు తదితర అంశాలపై చర్చించింది. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను మున్సిపల్ షాపుల్లో పునరుద్ధరించాలని సూచించారు. దీనిపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు చర్చించుకుని త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి మాట్లాడేందుకు నిర్ణయించారు. కౌన్సిల్ సూచించినట్లుగా మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందలేదని ఎమ్మెల్యే ఆనందరావు వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌ను మరోసారి రూపొందించి పంపించాలన్నారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్ భవిష్యత్ అవసరాలకు సరిపోని దృష్ట్యా ఇదే డంపింగ్ యార్డ్‌కు ఎదురుగా పంట కాల్వ అవతల ఉన్న 12 ఎకరాల స్థలంలోకి మార్చే ప్రతిపాదనను కౌన్సిల్‌కు వివరించారు. కాల్వ అవతల ఉన్న నాలుగున్నర ఎకరాల ఇరిగేషన్ పోరంబోకు స్థలంతో పాటు రైతుల నుంచి మిగిలిన ఎకరాలను సేకరించే అంశంపై చర్చించారు. పట్టణం చెంత నుంచి జాతీయ రహదారి వెళ్లిన దృష్ట్యా పూర్వం నిర్దేశించిన రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్పుపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. పాత రైల్వే డీపీఆర్‌ను మార్చడం సాధ్యం కాదని, అలాంటప్పుడు కొత్త అలైన్‌మెంట్ ఎలా సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రశ్నించారు.

నల్ల బ్యాడ్జీలతో మున్సిపల్ ఉద్యోగుల నిరసన

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త సత్యనారాయణ ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై ఈ నిరసన తెలుపుతున్నామని ఉద్యోగుల సంఘం ప్రతినిధి, ఆర్వో బి.శ్రీలక్ష్మి కౌన్సిల్‌కు వివరించారు. దీనిపై తొలుత ఎమ్మెల్యే ఆనందరావు ఉద్యోగులను మందలించారు. మీకొచ్చిన సమస్యపై కమిషనర్‌తో ముందు చర్చించకుండా మీకు మీరే నిర్ణయాలు తీసుకుని నిరసన బాట పట్టే హక్కు మీకెక్కడుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పాలక పక్షం కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఎమ్మెల్యేకు జరిగిన వాస్తవ పరిస్థితిని వివరించారు. ఇదే సందర్భంగా చైర్‌పర్సన్, ఆమె భర్త ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరును సమావేశానికి వివరణాత్మకంగా చెప్పారు. చైర్‌పర్సన్ భర్త పెత్తనంపై ఉద్యోగులు భయపడి పోతున్నారని తెలిపారు. దీనిపై చైర్‌పర్సన్ నాగేంద్రమణి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు వివరణ ఇచ్చినప్పటికీ పాలక పక్షం కౌన్సిలర్లు సంతృప్తి చెందకుండా ఆమె తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు తీసుకునే నిర్ణయాన్ని పాలక పక్ష కౌన్సిలర్లతోనైనా చర్చించలేదు. మేమంతా కలసి ఎన్నుకుంటనే మీరు చైర్‌పర్సన్ అయ్యారు. ముందు మీరు అది మరిచిపోయి ప్రవర్తిస్తున్నారని మండి పడ్డారు. మీపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసి మీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని నాగేంద్ర హెచ్చరించారు. దీనిపై పాలక పక్షానికి చెందిన మరో కౌన్సిలర్ సంసాని బులినాని జోక్యం చేసుకుని చిన్న విషయాన్ని కౌన్సిల్‌లో చర్చించి రచ్చ చేయకండని హితవు పలికారు. కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు మాట్లాడుతూ ఈ విషయంలో ఉద్యోగుల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపేంత సమస్య కాదని వారికి చెప్పానని అన్నారు. ఎమ్మెల్యే, పాలక పక్షం కౌన్సిలర్లు కమిషనర్ ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

టీపీఓ ధోరణిపై ఆగ్రహం

- కనీస గౌరవం ఇవ్వలేదంటూ వైస్ చైర్మన్ హేమసుందరి ఆవేదన
- కమిషనర్ క్షమాపణ చెప్పడంతో సద్దుమణిగిన వివాదం
- ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశం

ముమ్మిడివరం: రేకుల షెడ్డు నిర్మాణ విషయంలో కౌన్సిల్ సభ్యురాలిని ఏకవచనంతో సంబోధిస్తూ నోటీసు జారీ చేసిన సంఘటన కౌన్సిల్ సమావేశంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశపు హాలులో గురువారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలపై చర్చిస్తుండగా మూడవ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ రెడ్డి హేమసుందరి మాట్లాడుతూ తన ఇంటి ఎదురుగా రేకుల షెడ్డు వేసుకుంటే టీపీఓ రాజేష్ బాబు తమ సిబ్బందితో వచ్చి తన పట్ల ఏకవచనంతో మాట్లాడుతూ ఆయన లేరా..ఎక్కడకు వెళ్లారు, ఎప్పుడు వస్తాడు అంటూ సంబోధిస్తూ నోటీసు జారీ చేసి రేకుల షెడ్డు తొలగించేందుకు ప్రయత్నించారని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారి సంజాయిషీ ఇవ్వాలని పట్టుబట్టారు. చైర్మన్ కమిడిప్రవీణ్‌కుమార్ టీపీఓ రాజేష్‌బాబును వివరణ కోరగా ఏకవచనంతో మాట్లాడలేదని నోటీసు తీసుకోవాలని కోరామని చెప్పడంతో హేమసుందరి తీవ్ర అభ్యంతరం చేశారు. మీరు, సిబ్బంది ప్రవర్తించిన తీరు సాక్ష్యాధారాలతో మీ ముందు ప్రవేశ పెడతామని చెప్పారు. షెడ్డు నిర్మాణ విషయమై ముందుగా కమిషనర్ పి.రవివర్మకు తెలియజేశామని, ఆయన పంచాయతీ అప్రూవల్ తీసుకోవాలని చెపితే అందుకు సంబంధించిన పత్రాలు పంచాయతీ కార్యాలయంలో అందజేసి చలానా కూడా చెల్లించామన్నారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ టీపీఓ రాజేష్‌బాబు తీరు సమ్మతయోగ్యంగా లేదని నోటీసు జారీ చేసేముందు కనీసం చైర్మన్‌గా నా దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని అడిగితే బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారని టీపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యురాలి ఇంటికి అంతమంది సిబ్బందిని తీసుకువెళ్లి నోటీసులు జారీ చేయడమేమిటన్నారు. నగర పంచాయతీలో అనేక అక్రమ కట్టడాలు ఉన్నాయని, ఎంతమందికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకొన్నారో చెప్పాలంటూ నిలదీశారు. కమిషనర్ పి.రవివర్మ వివరణ ఇస్తూ కొందరు షెడ్డు నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారని, దీన్ని దృష్టిలో పెట్టుకొనే నోటీసు జారీ చేయాల్సి వచ్చిందని చెప్పగా అందుకు చైర్మన్‌తో సహా కొంతమంది సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీపీఓ రాజేష్ బాబు సంజాయిషీ ఇవ్వాలని పట్టుబట్టారు. కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ జరిగిన ఘటనపై టీపీఓ రాజేష్‌బాబు, సిబ్బంది తరఫున క్షమాపణ చెప్పారు. ఇకపై సభ్యుల పట్ల ఏకవచనంతో మాట్లాడితే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం అజెండాలోని 51 అంశాలలో రెండు అంశాలు మినహా మిగిలిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ మెప్మా డ్వాక్రా గ్రూపుల సభ్యులకు రుణాల మంజూరు విషయంలో సభ్యుల నుంచి ఆర్‌పీలు రూ.1,500 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై మెప్మా సీఎంఎం భాస్కర్ మాట్లాడుతూ అటువంటిదేమీ లేదని చెప్పగా ములపర్తి అభ్యంతరం వ్యక్తం చేస్తూ తన దగ్గర సాక్ష్యాధారాలు ఉన్నాయంటూ సెల్‌ఫోన్‌లో బాధితురాలి సంభాషణ వినిపించారు. అందుకు సంబంధించి కొన్ని పత్రాలు చూపించారు. దీనిపై కమిషనర్ రవివర్మ స్పందించి మీ దగ్గర ఉన్న ఆధారాలు అందిస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటానని చెప్పారు. వైస్ చైర్మన్ వి.బోసుబాబు, కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి



అమలాపురంలో సాగిన ర్యాలీ

అమలాపురం రూరల్: తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ చేయాలని కలెక్టరేట్ ఎదుట గురువారం క్రైస్తవులు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్‌ను ముట్టడించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తొలుత గడియార స్తంభం సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు సంతాప ర్యాలీలో వందలాదిమంది పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమగ్ర విచారణ జరిపించి ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులు ఎంతటి వారైనా అదుపులోకి తీసుకుని శిక్షించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు కలెక్టరేట్‌కు చేరుకుని న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. క్రైస్తవ సంఘాల నాయకులు మొసలి స్వర్జన్ రాజు, రాజ్‌కుమార్, ప్రభుకుమార్, సామ్యూల్ జ్యోతి యహోశోవ, జోసెఫ్, ఆనందరావు, కృపావరం,రవిపాల్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎంపీపీ ఎన్నిక

- ఇద్దరు వైఎస్సార్ సీపీ, ముగ్గురు టీడీపీ ఎంపీటీసీ సభ్యుల గైర్హాజర్
- ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం వచ్చిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు



సత్యవతికి ఎంపీపీగా ఎంపికైనట్టు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి వెంకట్రావు

కాట్రేనికోన: మండల పరిషత్ అధ్యక్షురాలి ఎంపిక గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, ఎన్నికల ప్రత్యేక అధికారి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక కో–అప్షన్ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతి చెందగా, చెయ్యేరు ఎంపీటీసీ సభ్యురాలు రాజీనామా చేశారు. మిగిలిన 19 మంది సభ్యులలో వైఎస్సార్ సీపీ సభ్యులు16 మంది, టీడీపీ నుంచి ముగ్గురు ఉన్నారు. వైఎస్సార్ సీపీలో ఇద్దరు అసమ్మతి ఎంపీటీసీలు, ముగ్గురు టీడీపీ ఎంపీటీసీలు ఎన్నికలకు గైర్హాజరు కావడంతో 14 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల కోరంతో ఎంపీపీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఎంపీపీ అభ్యర్థిగా కోలాటి సత్యవతి పేరును గెద్దనపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మోత రామలక్ష్మి ప్రతిపాదించగా దొంతికుర్రు ఎంపీటీసీ సభ్యురాలు రేవు సత్యవతి బలపరిచారు. ఎంపీపీ అభ్యర్థి కోలాటి సత్యవతికి మద్దతుగా మిగిలిన వైస్సార్ సీపీ సభ్యులు చేతులు పైకి ఎత్తి మద్దతు తెలుపగా ఎన్నికల అధికారి ఆమోదించారు. అనంతరం కోలాటి సత్యవతితో ఎన్నికల అధికారి ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, పార్టీ అధికార ప్రతినిధి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్, తాత్కాలిక ఎంపీపీ ఏడిద అరుణ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, నాయకులు ఏడిద సుబ్బు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ వెంకటాచలం అభినందనలు తెలిపారు. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన కోలాటి సత్యవతి పార్టీ సీనియర్ నాయకులు ఏడిద చక్రఫణిరావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

టి.కొత్తపల్లి సొసైటీలో అక్రమాలపై విచారించాలి

ఐ.పోలవరం: టి.కొత్తపల్లి సహకార సంఘంలో కార్యదర్శి చేసిన అక్రమాలు తేల్చాలని రైతులు ఆందోళనకు దిగారు. గురువారం సొసైటీ మహాజన సభ వజ్రపు వెంకట నారాయణ అధ్యక్షతన సహకార సంఘం వద్ద జరిగింది. సంఘ పరిధిలో జరిగిన అక్రమాలు, 3శాతం రైతులకు రావలసిన సబ్సిడీ, హమాలీ చార్జీలు, హెచ్‌ఆర్‌ఏ, ఇతర ఖర్చులు బహిరంగ విచారణ జరపాలని రైతులు అధికారుల ఎదుట పట్టుబట్టారు. ప్రధానంగా చిన్న సన్నకారు రైతుల నుంచి రుణాలు తిరగవేసే విధానంలో అధిక వడ్డీలు వసూలు చేయడం ఏమిటని నిలదీశారు. ప్రధానంగా సొసైటీ కి రావలసిన రూ.6కోట్ల బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదని అధికారులను నిలదీశారు. ఈ విషయంపై మురమళ్ల డీసీసీబీ బ్రాంచ్ మేనేజరు జి.బి.మనోహర్ ఇప్పటికే విచారణకు అదేశించారని నివేదిక రాగానే కార్యదర్శి కుమార్‌పై చర్యలు తీసుకొంటామని ఉన్నతాధికారులు తెలిపారు.

4 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించేందుకు దేవస్థాన ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది భక్తుల సహకారంతో కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఇప్పటికే పలుమార్లు సమావేశమై చర్చించారు. ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 9.54 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయడంతో పాటు పసుపు కొట్టడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 7వ తేదీ ఉదయం 8.58 గంటలకు స్వామి వారి కళ్యాణం జరుగుతుంది. 8వ తేదీ సాయంత్రం 3.15 గంటలకు పురవీధుల్లో స్వామి రథోత్సవం, దేవస్థానం వద్ద తీర్థం జరుగుంది.

ఘనంగా షబ్-ఎ-ఖదర్

యానాం: రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ముస్లింలు షబ్-ఎ-ఖదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న చారిత్రక జామియా మసీదు, మసీదే కూబాల్లో ముస్లింలు మసీదుల్లో రాత్రంతా ఖురాన్‌లోని శ్లోకాలను పఠిస్తూ గడిపారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు ధర్మం, విశ్వాస మార్గంలో ముస్లింలు అనుసరించడానికి ఖురాన్‌లోని శ్లోకాలతో పాటు ప్రవక్త జీవితంపై చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం జామియా మసీదును విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. జామియా మసీదు అధ్యక్షుడు ఎస్‌కెఎమ్ జిలానీ, వైస్‌ప్రెసిడెంట్ కరీమ్, ట్రెజరర్ జిలానీ పాల్గొన్నారు.

మే నాటికి మూడు పథకాలు అమలు

అల్లవరం: సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మే నాటికి మహిళలకు ఉచిత బస్సు, తల్లి వందనం, ప్రతి మహిళలకు రూ. 1,500 ఇస్తామని, ఇందుకు కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. తూర్పులంకలో సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ని గురువారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కడలి గంగాచలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడారు. తొలుత మొగళ్ళమూరు పంచాయతీ పరిధిలోని శిరగట్లపల్లిలో సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ను ప్రారంభించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, కార్పొరేషన్ డైరెక్టర్లు కడలి వెంకటేశ్వరరావు, డి.సత్తిబాబురాజు, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, నడింపల్లి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, నీటి సంఘం చైర్మన్ దాట్ల గోపిరాజు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం

అమలాపురం టౌన్: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతి పట్ల అమలాపురం టౌన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (టీసీవైఏ) సంతాపం తెలిపింది. స్థానిక అరిగెల పాలెంలో గురువారం జరిగిన పాస్టర్ ప్రవీణ్ సంతాప సభలో టీసీవైఏ అధ్యక్షుడు నక్కా రాజ్ కిషోర్ మాట్లాడుతూ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు ఆదరణ కలగజేయాలని కోరారు. టీసీవైఏ సెక్రటరీ గొల్ల ప్రసన్నకుమార్, కోశాధికారి అనిల్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

తాళ్లరేవు: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ ధర్నానుద్దేశించి సీపీఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, టి.ఈశ్వరరావు, సీహెచ్ రమణి తదితరులు మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీలలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చొల్లంగి నుంచి నీలపల్లి వరకు సైకిల్ యాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్‌లు లేకపోవడం, జలజీవన్ మిషన్ నిధులు లేక కొత్తగా వేసిన కుళాయిల నుంచి నీరు రాకపోవడం, పారిశుద్ధ్యం తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్లు రాజబాబు, డి.అదృష్టదీపుడు పాల్గొన్నారు.

కార్పెంటర్ల ఉపాధికి గండి

అమలాపురం టౌన్: కార్పొరేట్ సంస్థల ఉత్పత్తుల రాకతో కార్పెంటర్ల ఉపాధికి గండి పడిందని జిల్లా కార్పెంటర్ (వడ్రంగి) చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా చేతివృత్తుల సంఘం కార్యాలయ ఆవరణంలో గురువారం జరిగిన కార్పెంటర్ డే సందర్భంగా సూర్యనారాయణమూర్తి మాట్లాడారు.